# ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం

## సీఎం కేసీఆర్ ప్రసంగానికి ఒకటే ఈలలు, చప్పట్లు



లక్ష్మీపురంలో జరిగిన సభకు హాజరైన అశేష జనవాహిని

భద్రాచలం, నవంబర్ 13 : బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారు. సభా ప్రాంగణంతోపాటు లక్ష్మీపురం గ్రామం మొత్తం జనమే. జనమా! ప్రభంజనమా! అన్నట్లుగా ఉంది. మహిళలు, వృద్ధులు, చిన్నారులు, యువకులు ఎక్కడ చూసినా ప్రజలే. తమ ఆరాధ్య ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్‌ను చూసేందుకు ప్రజలు ముందుగానే సభా ప్రాంగణాలకు చేరుకున్నారు. సీఎం కేసీఆర్ వేదికపైకి వచ్చేంత వరకు కళాకారులు ఆలపించిన గీతాలకు సభకు వచ్చిన మహిళలు సైతం చిందులేశారు. కేసీఆర్ సార్ వచ్చేవరకు ప్రజలు ఎంతో ఓపికతో ఎదురుచూశారు. కేసీఆర్ మాట్లాడుతున్నంత సేపు వేదికంతా పిన్ డ్రాప్ సైలెన్స్‌గా ఉంది. కరటక, దమనకులు వస్తారు అంటూ ప్రత్యర్థులను ఉద్దేశించి మాట్లాడిన తీరుకు సభలోని వారంత ఈలలు, చప్పట్లతో తమ సంతోషాన్ని తెలిపారు. పినపాకలో రేగా కాంతారావు, భద్రాచలంలో డాక్టర్ తెల్లం వెంకట్రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునివ్వగా పార్టీ శ్రేణులు, ప్రజలు బీఆర్ఎస్ జిందాబాద్, సీఎం కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

# రామయ్యకు ముత్తంగి అలంకరణ



రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, నవంబర్ 13 : భద్రాచలం సీతా రామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.30 లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను ధరింపజేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి సంప్రదాయబద్ధంగా నిత్య కల్యాణం జరిపించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామి వారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

# భద్రాచలం నియోజవర్గానికి కేసీఆర్ వరాలు

## త్వరలో రూ.39.50 కోట్లతో కరకట్ట పూర్తి

## పైలెట్ ప్రాజెక్టుగా ‘దళితబంధు’

## పోడు భూములన్నింటికీ ‘రైతుబంధు’



గులాబీజెండాలు ఊపి మద్దతు తెలుపుతున్న మహిళలు

భద్రాచలం, నవంబర్ 13 : భద్రాచలం నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు తమ నియోజకవర్గంలో దళితబంధును పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి నియోజకవర్గంలోని దళితులందరికి ఒకేసారి దళితబంధు అమలుచేయాలని కోరడంతో భద్రాచలంలో కూడా దళితబంధును పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా కొంతమంది గిరిజనులకు పోడు పట్టాలు వచ్చినా కూడా రైతుబంధు పథకం అమలుకావడం లేదనే విషయం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు తెలపగా ఈ విషయంపై కూడా సీఎం కేసీఆర్ స్పందించి పరిష్కరిస్తామని చెప్పారు. భద్రాచలంలో కరకట్ట నిర్మాణాన్ని రూ.1000 కోట్లతో పూర్తి చేస్తామని, తానే పర్యవేక్షణ చేస్తానన్నారు. సీతారామ ప్రాజెక్టు, సీతమ్మ బరాజ్ ద్వారా 37టీఎంసీల నీరు నిల్వ చేయడంతోపాటు హైడ్రో ఎలక్ట్రిక్‌ను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా రైతుబంధు, ధరణి పోర్టల్, 24గంటల కరెంట్, రైతుబీమా, మెరుగైన వైద్యం, పోడు భూములకు పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి కావాలంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును గెలిపించాలన్నారు.

# సభను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు



బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం, నవంబర్ 13 : ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసిన అశేష ప్రజానీకం, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సీఎం కేసీఆర్ అభిమానులకు భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం లక్ష్మీపురంలో జరిగిన సభకు విశేషంగా హాజరైన ప్రజలను చూస్తుంటేనే మాపై ప్రజలకు ఎంత అభిమానం ఉందో తెలుస్తుందన్నారు. ఈ సభలో సీఎం కేసీఆర్ మన నియోజకవర్గం, గిరిజనులు, దళితులపై తనకు ఎంత ప్రేమ ఉందో తెలిపారని, అలాగే భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ఆకాంక్ష ఎంత బలంగా ఉందో వారిమాటల ద్వారా అర్థమైందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి కేటాయించిన నిధులు, వాటిద్వారా జరిగిన అభివృద్ధి, సాగునీరు, తాగునీరు, వివిధ పథకాల ద్వారా ఈ ప్రాంత నిరుపేద గిరిజనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులు వివరించారన్నారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే తనను గెలిపించాలని కోరారు. ముఖ్యంగా భద్రాచలం పట్టణానికి ప్రధాన సమస్యగా ఉన్న వరదలు, వరద నివారణ చర్యల్లో భాగంగా రూ.1000 కోట్లతో కరకట్ట నిర్మాణాన్ని చేపట్టడం తానే స్వయంగా పర్యవేక్షణ చేస్తానని చెప్పడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అలాగే సభకు విచ్చేసిన సీఎం కేసీఆర్ సార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సభకు తరలిన బీఆర్ఎస్ కార్యకర్తలు



దుమ్ముగూడెం, నవంబర్ 13 : లక్ష్మీపురం గ్రామంలో సోమవారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు దుమ్ముగూడెం మండలం మారాయిగూడెం గ్రామం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు అన్నెం సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వాహనాలను ఏర్పాటు చేశారు.

# ఐదుగురి నామినేషన్లు తిరస్కరణ

భద్రాచలం, నవంబర్ 13 : భద్రాచలం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసేందుకు వేసిన నామినేషన్లలో ఐదుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని రిటర్నింగ్ అధికారి మాలోల్ మంగీలాల్ సోమవారం ప్రకటనలో తెలిపారు. భారత రాష్ట్ర సమితి తరపున నామినేషన్ సమర్పించిన దుమ్ముగూడెం జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, భారతీయ జనతా పార్టీ తరపున నామినేషన్ వేసిన కుంజా సంతోష్‌కుమార్, సీపీఐ(ఎం) తరపున నామినేషన్ వేసిన కొర్సా చిలకమ్మ, ఆబాద్ పార్టీ తరపున నామినేషన్ వేసిన చీమల వీరభద్రం, బహుజన్ ముక్తి పార్టీ తరపున నామినేషన్ వేసిన బొర్రా రాజుల నామినేషన్లు స్క్రూట్నీలో తిరస్కరణకు గురయ్యాయని పేర్కొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు

## ఎన్నికల పరిశీలకుడు కమల్‌కిశోర్



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న కమల్‌కిశోర్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 13 : ఎన్నికల సంఘం నియమావళి మేరకు పోలింగ్ కేంద్రాల్లో అన్నిరకాల మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకుడు కమల్‌కిశోర్ తెలిపారు. సోమవారం కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని 91 నుంచి 99, 153 నుంచి 167 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం సురక్షిత మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్, దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ర్యాంపులు, దివ్యాంగుల సహాయార్థం వీల్‌చైర్లు సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. నూతన ఓటర్లకు సులభంగా అర్థమయ్యే విధంగా ఈవీఎంల వినియోగంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట లైజన్ ఆఫీసర్ జినుగు మరియన్న, డీటీ అంజద్ పాషా, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# వెంకట్రావు గెలుపే ధ్యేయం

## రావులపల్లి రాంప్రసాద్

చర్ల, నవంబర్ 13 : భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును గెలిపించేందుకే బీఆర్ఎస్‌లో చేరానని, ఆయన గెలుపే ధ్యేయంగా పనిచేస్తానని రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. ఇటీవల సీపీఐ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన రావులపల్లి రాంప్రసాద్ సోమవారం కుదునూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ఇక్కడ వెంకట్రావుకు ఓటేస్తే అక్కడ కేసీఆర్‌కు ఓటేసినట్టేనని అన్నారు. కుదునూరు, వీరాపురం గ్రామాలకు చెందిన పలువురు సీపీఐ నాయకులు కార్యకర్తలు రాంప్రసాద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. రాంప్రసాద్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వాసురాజు, జగదీశ్, పవన్, సంతోష్, నరసింహారావు, సురేశ్, కిరణ్, విజయ్, సందీప్ పలువురు కార్యకర్తలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు ప్రచారంలో పాల్గొన్నారు.



రావులపల్లి రాంప్రసాద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరికలు